మొక్కజొన్న పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి

ప్రజాశక్తి - పోలవరం

మొక్కజొన్న పంటకు గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కోరుతూ కొత్త పట్టిసీమ గ్రామంలో మొక్కజొన్న రైతులు కల్లాల వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ మొక్కజొన్న గింజలను దళారులు కొనుగోలు చేయడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. వారి వారి అవకాశాలను బట్టి ధర హెచ్చుతగ్గులు చేస్తూ రైతులకు నష్టాలు చూపుతున్నారన్నారు. దీనిపై సంబంధిత అధికారులు స్పందించి రైతులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పూడి వెంకట్రావు, సిద్ధంశెట్టి సత్యనారాయణ, శ్రీరాములు, రంభ వీరబాబు, కడియం సూరిబాబు, ఉప్పలపాటి శ్రీను, సిదిరి శ్రీరాములు, రైతులు పాల్గొన్నారు.

జెడ్‌పి ఛైర్మన్ గిరి దక్కేదెవరికో..!



ప్రస్తుత ఛైర్మన్ కవురు శ్రీనివాస్ ఎంఎల్‌సిగా ఎన్నిక
3 నుంచి ఎంఎల్‌సి బాధ్యతల్లోకి కవురు
నూతన ఛైర్మన్ ఎంపికపై కొనసాగుతున్న ఉత్కంఠ
జెడ్‌పి పీఠం బిసి సామాజిక తరగతికి రిజర్వు
ఛైర్మన్ పదవి రేసులో ప్రముఖంగా పెదపాడు జెడ్‌పిటిసి పేరు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లా పరిషత్ ఛైర్మన్ పదవిపై ఉత్కంఠ సాగుతోంది. ప్రస్తుత జెడ్‌పి ఛైర్మన్‌గా ఉన్న కవురు శ్రీనివాస్ స్థానిక సంస్థల కోటాలో ఎంఎల్‌సిగా ఎన్నిక కావడంతో ఛైర్మన్ పదవి ఎవరికి దక్కుతుందోననే చర్చ రాజకీయాల్లో విస్తృతంగా సాగుతోంది. మే మూడోతేదీ తర్వాత కవురు శ్రీనివాస్ పూర్తిస్థాయి ఎంఎల్‌సిగా బాధ్యతల్లోకి వెళ్తున్నారు. సమయం దగ్గర పడుతుండటంతో ఛైర్మన్ పదవికి అభ్యర్థి ఎంపిక చర్చనీయాంశం మారింది. ఎంఎల్‌సిగా ఎన్నికైనప్పటికీ అధికారికంగా పదవీబాధ్యతలు చేపట్టకపోవడంతో ఇప్పటికీ కవురు శ్రీనివాస్‌నే జెడ్‌పి ఛైర్మన్‌గా కొనసాగుతున్నారు. మే మూడో తేదీ తర్వాత ఆయన ఆ పదవి నుంచి వైదొలగాల్సి ఉంది. దీంతో తదుపరి జెడ్‌పి ఛైర్మన్ ఎవరు అనే అంశం ఉత్కంఠ రేపుతోంది. 2021లో జిల్లా పరిషత్ ఎన్నికలు జరిగాయి. జిల్లా పరిషత్ ఛైర్మన్ పదవి బిసి సామాజిక తరగతికి కేటాయించబడింది. దీంతో కవురు శ్రీనివాస్‌ను జెడ్‌పి ఛైర్మన్ అభ్యర్థిగా వైసిపి ప్రకటించింది. యలమంచిలి మండల జెడ్‌పిటిసిగా కవురు గెలిచి ఛైర్మన్ పీఠం అధిరోహించారు. పట్టుమని రెండేళ్ల గడవకముందే కవురు శ్రీనివాస్‌కు మళ్లీ ఎంఎల్‌సిగా వైసిపి అధిష్టానం అవకాశం కల్పించింది. సామాజిక తరగతి లెక్కల్లో భాగంగా కవురును ఎంఎల్‌సి పోటీలో దింపారు. ఎంఎల్‌సి ఎన్నికల్లో కవురు గెలుపొందడంతో జెడ్‌పి ఛైర్మన్ పదవి నుంచి తప్పుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. దీంతో ఆ పదవి కోసం ఎవరి ప్రయత్నాల్లో వారు చేస్తున్నారు. జిల్లాల విభజన పూర్తయినప్పటికీ జిల్లా పరిషత్ మాత్రం ఉమ్మడి జిల్లాగానే కొనసాగుతోంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 48 మండలాలు ఉండగా 46 స్థానాల్లో వైసిపి జెడ్‌పిటిసిలే గెలిచారు. మొత్తం గెలిచిన స్థానాల్లో పది చోట్ల బిసిలు ఉన్నారు. ఇందులో యలమంచిలి, భీమడోలు, భీమవరం, కాళ్ల, మొగల్తూరు, నరసాపురం, పాలకోడేరు, పెదపాడు, ఉండి, ఉంగుటూరు జెడ్‌పిటిసి స్థానాలు ఉన్నాయి. వీటిలో ఐదుస్థానాలు బిసి మహిళలు గెలిచారు. కవురు శ్రీనివాస్ జెడ్‌పి ఛైర్మన్ పదవి నుంచి తప్పుకోవడంతో ఆ పదవి కోసం బిసి సామాజిక తరగతికి చెందిన జెడ్‌పిటిసిలంతా తమ ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. ప్రముఖంగా మాత్రం పెదపాడు జెడ్‌పిటిసి గంటా పద్మశ్రీ పేరు వినిపిస్తోంది. గంటా పద్మశ్రీ కాబోయే జెడ్‌పి ఛైర్మన్ అంటూ పలు సమావేశాల్లో దెందులూరు ఎంఎల్‌ఎ కొఠారు అబ్బాయి చౌదరి సైతం ప్రకటించడం జరిగింది. అయితే అధిష్టానం మదిలో ఏముందో తెలియని పరిస్థితి నెలకొంది.

ఏలూరు జిల్లాకు జెడ్‌పి ఛైర్మన్ పదవి ఇవ్వాలని డిమాండ్

జిల్లా పరిషత్ ఛైర్మన్ పదవి ఏలూరు జిల్లాకు ఇవ్వాలంటూ ఈ జిల్లాలోని వైసిపి నేతలు గట్టిగా డిమాండ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. అందుకు అనేక కారణాలున్నాయి. ప్రధాన పదవుల్లో ఉన్న నాయకులంతా పశ్చిమగోదావరి జిల్లాలోనే ఉన్నారు. రెండు మంత్రి పదవులు పశ్చిమకే దక్కాయి. శాసనమండలి ఛైర్మన్ మోషేన్‌రాజు భీమవరానికి చెందినవారే. ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాద్‌రాజు, స్థానిక సంస్థల కోటాలో ఎంఎల్‌సిగా ఎన్నికైన కవురు శ్రీనివాస్, వంకా రవీంద్రనాథ్ కూడా అదే జిల్లాకు చెందిన వారు. డిసిసిబి ఛైర్మన్, డిసిఎంఎస్ ఛైర్మన్ పదవులు అదే జిల్లాకు చెందిన నాయకులకు దక్కాయి. దీంతో జెడ్‌పి ఛైర్మన్ పదవి ఏలూరు జిల్లాకు చెందిన వ్యక్తికి ఇవ్వాలనే డిమాండ్ గట్టిగా వినిపిస్తోంది. ఈ జిల్లాలో ఎంతోకొంత బలం ఉన్న జెడ్‌పిటిసిగా గంటా పద్మశ్రీ పేరు వినిపిస్తోంది. అదే సమయంలో మరో ప్రచారం కూడా జరుగుతోంది. కవురు శ్రీనివాస్ రాజీనామా చేసిన యలమంచిలి జెడ్‌పిటిసి స్థానానికి ఎన్నిక నిర్వహించిన తర్వాత ఛైర్మన్ పదవి భర్తీ చేస్తారనే ప్రచారం సాగుతోంది. తమకు నచ్చిన నాయకుడిని యలమంచిలి జెడ్‌పిటిసిగా గెలిపించి ఛైర్మన్ పదవి సదరు నాయకుడికి కట్టబెట్టాలనే ఆలోచన సైతం అధిష్టానం మదిలో ఉన్నట్లు చెబుతున్నారు. దీంతో జెడ్‌పి ఛైర్మన్ ఎవరో అనే చర్చ జిల్లాలో విస్తృతంగా సాగుతోంది.

ఇంటర్‌లో బాలికలదే పైచేయి

రాష్ట్రస్థాయిలో జిల్లాకు ఫస్టియర్‌లో 2వ, సెకండియర్‌లో 3వ స్థానం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

గత మార్చిలో నిర్వహించిన ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాల్లో జిల్లాలో విద్యార్థినులు సత్తా చాటారు. బాలురకన్నా బాలికలే మెరుగైన ఫలితాలు సాధించారు. ఇంటర్ ఫలితాలు బుధవారం సాయంత్రం విడుదలయ్యాయి. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఫస్టియర్ ఫలితాల్లో 70 శాతం ఉత్తీర్ణత సాధించగా, సెకండియర్ ఫలితాల్లో 77 శాతం ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 73 శాతం ఉత్తీర్ణతతో బాలికలు పైచేయి సాధించగా బాలురు 50 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొదటి సంవత్సరం ఫలితాల్లో బాలికలు 58 శాతం ఉత్తీర్ణత సాధించగా బాలురు 37 శాతం ఉత్తీర్ణత సాధించారు. సాధారణ విభాగంలో మొదటి సంవత్సరం పరీక్షలకు 29,110 మంది హాజరవ్వగా 70 శాతంతో 20,237 మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 27,691 మంది హాజరవ్వగా 77 శాతంతో 21,359 మంది ఉత్తీర్ణత సాధించారు. వృత్తి విద్యా విభాగంలో మొదటి సంవత్సరం పరీక్షలకు 36,031 మంది హాజరవ్వగా 49 శాతంతో 17,507 మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 31,293 మంది హాజరవ్వగా 62 శాతంతో 19,430 మంది ఉత్తీర్ణత సాధించారు. గత సంవత్సరం ఫలితాలతో పోలిస్తే సాధారణ విభాగంలో ఐదో స్థానంలో ఉన్న జిల్లా ఈ సంవత్సరం మొదటి సంవత్సరం ఫలితాల్లో ద్వితీయ స్థానం, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో మూడో స్థానం సాధించింది. గత ఐదు సంవత్సరాల ఫలితాలు చూస్తే 2018లో 75 శాతంతో జిల్లా ఐదోస్థానంలోనూ, 2019లో 74 శాతం ఉత్తీర్ణతతో మూడో స్థానం, 2020లో 71 శాతం ఉత్తీర్ణతతో రెండో స్థానంలోనూ 2022లో 64 శాతం ఉత్తీర్ణతతో ఐదో స్థానంలోనూ నిలిచింది. 2021లో కరోనా కారణంగా ఇంటర్ పరీక్షలు జరగలేదు. గత ఫలితాలతో పోలిస్తే ఈ సంవత్సరం జిల్లా విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారని చెప్పొచ్చు.

అన్ని సీట్లూ గెలుచుకుంటాం : కారుమూరి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలోని అన్ని స్థానాలనూ వైసిపి కైవసం చేసుకుంటుందని పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ఆశాభావం వ్యక్తం చేశారు. బుధవారం మండలంలోని శ్రీనివాసపురంలో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగసభలో మంత్రి మాట్లాడుతూ సిఎం జగన్ ప్రజలకు ఆదర్శవంతమైన పాలన అందిస్తున్నారన్నారు. శ్రీనివాసపురంలో రూ.22 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపట్టడం అభినందనీయమన్నారు. నాడు-నేడుతో పాఠశాలల అభివృద్ధి, ఆడపిల్లలకు శుభ్రమైన బాత్‌రూమ్‌లు ఏర్పాటు చేయడం తో ప్రభుత్వ పాఠశాలల్లో 50 శాతం అడ్మిషన్లు పెరిగాయని తెలిపారు. తల్లులకు అమ్మఒడి ఇచ్చి పిల్లలను బడికి పంపేలా చేశారన్నారు. గత ప్రభుత్వ పాలనలో 14వ స్థానంలో ఉండగా నేడు జగన్ రెండో స్థానానికి తీసుకువచ్చారని తెలిపారు. జన్మభూమి కమిటీలతో చంద్రబాబు దోపిడీ చేసి నేడు వాలంటీర్ వ్యవస్థను హేళన చేయడం దుర్మార్గమన్నారు. త్వరలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు పూర్తిస్థాయిలో ప్రారంభం అవుతాయని రైతులందరూ గిట్టుబాటు ధర పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి ఎంఎల్ఎ ఉన్నమట్ల ఎలిజా, ఎంపిపి కొదమ జ్యోతి, జెడ్‌పిటిసి సభ్యులు పోల్నాటి బాబ్జీ, మహిళా శిశుసంక్షేమ శాఖ రీజియన్ ఛైర్మన్ వందనపు సాయిబాలపద్మ, తహశీల్దార్ స్లీవజోజి, వ్యవసాయ శాఖ ఎడిఎ బుజ్జిబాబు, వ్యవసాయాధికారి పోసారావు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్లలో ఎస్‌పి తనిఖీలు

ప్రజాశక్తి - విలేకరులు

జిల్లా ఎస్‌పి డి.మేరీ ప్రశాంతి పలు పోలీస్‌స్టేషన్లను బుధవారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి పలు సూచనలు చేశారు.

మండవల్లిలో..

మండవల్లి: నూతన పోలీస్ స్టేషన్ నిర్మాణం పనులు త్వరితగతిన ప్రారంభించి పూర్తి చేయాలని జిల్లా ఎస్‌పి మేరీ ప్రశాంతి సిబ్బందిని ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌ను ఆమె బుధవారం తనిఖీ చేశారు. అలాగే త్వరలో నిర్మించే పోలీస్ స్టేషన్ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పనులను త్వరితగతన ప్రారంభించి పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ వైవిఎల్ లచ్చినాయుడు, ఎస్ఐ రామకృష్ణ, ఎఎస్ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

కలిదిండి: స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఎస్‌పి డి.మేరీ ప్రశాంతి బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. స్టేషన్ సిబ్బంది, మహిళా పోలీసుల వివరాలతో పాటు వారి పనితీరును ఎస్ఐ మణికుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట డిఎస్‌పి పైడేశ్వరరావు, కైకలూరు సిఐ వైవివిఎల్.నాయుడు పాల్గొన్నారు.

ముదినేపల్లి: జిల్లా ఎస్‌పి మేరీ ప్రశాంతి బుధవారం సాయంత్రం ముదినేపల్లి పోలీస్‌స్టేషన్ సందర్శించారు. ఎస్ఐ షణ్ముఖసాయి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఆనంతరం ఆమె రికార్డులు పరిశీలించి ఎస్ఐ పనితీరుపట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ కేసులు పెండింగ్ లేకుండా చూడాలన్నారు. త్వరితగతిన కేసుల్లో పురోగతిని సాధించాలన్నారు. వేసవిలో చోరీలు ఎక్కువగా జరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఆమెవెంట కైకలూరు రూరల్ సిఐ నాయుడు ఉన్నారు.

ఉపాధ్యాయుల సస్పెన్షన్ సరికాదు

చింతలపూడి: శ్రీకాకుళం జిల్లాలో ఉపాధ్యాయుల సస్పెన్షన్‌ను తక్షణం ఎత్తివేయలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎవి.అప్పారావు డిమాండ్ చేశారు. రాఘవాపురం హైస్కూల్ వద్ద నల్లరిబ్బన్లతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్ ఉపాధ్యాయులను చిన్నచిన్న లోపాలకే సస్పెండ్ చేయడంపై మండిపడ్డారు. విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తున్న ఉపాధ్యాయులను సస్పెండ్ చేయడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

60 మంది డ్రైవర్లు సిఐటియులో చేరిక

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

పెదపాడు మండలం అప్పనవీడుకు చెందిన ఆటో డ్రైవర్లు 60 మంది సిఐటియు ఆటో యూనియన్‌లో చేరారు. బుద్ధ నాగసూరిబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.సోమయ్య మాట్లాడుతూ ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు సాధనకోసం పోరాడుతున్న సంఘం సిఐటియు మాత్రమేనన్నారు. నిత్యం ప్రయాణికులను చేరవేస్తూ స్వయం శక్తితో ఉపాధి పొందుతున్న ఆటో డ్రైవర్లకు షెల్టర్‌తో కూడిన పార్కింగ్ స్టాండ్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వివిధ రూపాల్లో రూ.లక్షల కోట్లను పన్నులుగా చెల్లిస్తున్న రవాణారంగంపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని ప్రశ్నించేందుకు ఆటో డ్రైవర్లందరూ సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. రవాణారంగ కార్మికులకు కేరళ తరహా సంక్షేమ చట్టాన్ని అమలు చేయాలని, 46వ లేబర్‌కమిషన్ సిఫార్సులకు చట్టబద్ధత కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.గోపి, ఆటో యూనియన్ ఏలూరు నగర అధ్యక్షులు చక్రాల అమర్ కుమార్, కెవిపిఎస్ జిల్లా నాయకులు ఎంఇస్సాక్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.జాన్‌బాబు, ఆటోడ్రైవర్లు పాల్గొన్నారు.

ఆక్వాలో కోళ్ల వ్యర్థాలు వాడితే చర్యలు

ఏలూరు: ఆక్వా చెరువులకు కోళ్లు, ఇతర వ్యర్థాలు సరఫరా చేసినా, వినియోగించినా ఎంతటి వారైనా ఉపేక్షించబోమని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో ఆక్వారంగ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు గురించి రైతులు, ట్రేడర్స్, మేతల షాపుల యూనియన్లతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన దృష్టికి వచ్చిన విషయాలను పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. ఆక్వా రైతులకు జిల్లా యంత్రాంగం అన్నివిధాలా సహకరిస్తుందన్నారు. అయితే ఆక్వా సాగులో కోళ్ల వ్యర్థాలను వినియోగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వీటివల్ల ఆక్వా ఉత్పత్తులు విషపూరితమయ్యే అవకాశం ఉందన్నారు. కోళ్ల వ్యర్థాలను సరఫరా చేసే వాహనాలను సీజ్ చేస్తామన్నారు. ఆక్వా రైతులను ఏ అధికారులైనా డబ్బుల కోసం ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే ఎనిమిది మంది ఫిషరీష్ అసిస్టెంట్లు, ఒక ఎఫ్‌డిఒపై చర్యలు తీసుకున్నామని చెప్పారు. ప్రభుత్వ నూతన విధానం ద్వారా ఆక్వాజోన్, నాన్ ఆక్వాజోన్ నోటిఫై చేశామన్నారు. నాన్‌ఆక్వా జోన్‌లో కొత్త చెరువులు తవ్వకానికి అనుమతులు జారీచేయబడవని స్పష్టం చేశారు. జిల్లాలో 1,38,969 ఎకరాల్లో ఆక్వాకల్చర్ ఉందన్నారు. రొయ్యల విత్తనాల ఉత్పత్తి, ఆక్వాసాగులో వివిధ అంశాల్లో ఆర్అండ్‌డి నిపుణులను భాగస్వాములను చేయాలని మత్స్యశాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. బ్రూడ్ బ్యాంకు అభివృద్ధికి ప్రభుత్వ విత్తన క్షేత్రాల్లో విత్తనోత్పత్తి చేపట్టాలని సూచించారు.

బిజెపికి గుణపాఠం తప్పదు

ప్రజాశక్తి - పోలవరం

మాట్లాడుతున్న పిల్లి రామకృష్ణ

రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిన బిజెపి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ ప్రజలకు పిలుపునిచ్చారు. సిపిఎం, సిపిఐ రాజకీయ ప్రచారభేరి యాత్ర ముగింపు సందర్భంగా మండలంలోని దేవరగొంది గ్రామంలో సిపిఎం మండల కార్యదర్శి గూడెల్లి వెంకట్రావు అధ్యక్షతన బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన తెల్లం రామకృష్ణ మాట్లాడుతూ మోడీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజావ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నారని, దేశ సంపదను కార్పొరేట్ కంపెనీలకు, పెట్టుబడిదారులకు కట్టబెడుతున్నారని విమర్శించారు. పార్టీ జిల్లా నాయకులు పిల్లి రామకృష్ణ మాట్లాడుతూ ఉపాధి హామీని నీరుగార్చేందుకు కేంద్ర ప్రభుత్వం నిధుల్లో కోత విధించిందన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నాగమణి మాట్లాడుతూ ఎస్‌టి జాబితాలో బోయ, వాల్మీకులను కలుపుతామని సిఎం జగన్ ప్రకటిస్తే గిరిజన ఎంఎల్ఎ తెల్లం బాలరాజు కనీసం మాట్లాడకపోవడం సిగ్గుచేటన్నారు. సిపిఎం మండల కార్యదర్శి వెంకట్రావు మాట్లాడుతూ మోడీ అధికారంలోకి రాకముందు రూ.400 ఉన్న గ్యాస్ సిలిండర్ ధర అధికారంలోకి వచ్చిన తర్వాత నేడు రూ.1300కు పెరిగిందని విమర్శించారు. రూ.80 ఉన్న పెట్రోల్ ధర రూ.110కి చేరిందన్నారు. నిత్యావసర ధరలు ఆకాశాన్నంటుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

చింతలపూడి : ప్రధాని మోడీ 2014 ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను ఇప్పటి వరకూ అమలు చేయకపోగా సామాన్యులపై పెనుభారాలు మోపి, దేశ సంపదను అదానీ, అంబానీలకు కట్టబెడుతున్నారని సిపిఎం మండల కన్వీనర్ ఆర్‌విఎస్ సత్యనారాయణ తెలిపారు. ప్రగడవరంలో సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో మోడీని గద్దె దించండి- దేశాన్ని కాపాడండి నినాదంతో చేపట్టిన రాజకీయ ప్రచారభేరి యాత్ర సాగింది. ఈ సందర్భంగా కరపత్రాలు పంపిణీ చేస్తూ ముందుకుసాగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించిన మోడీని గద్దె దించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కాగిత రాఘవులు, కనుమరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, పి.సుశీల, కె.ప్రసాద్, సిపిఐ నాయకులు, కె.గురవయ్య, జానీ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో సమస్యలు పరిష్కరించాలని ధర్నా

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఆందోళన చేస్తున్న రైతులు, నాయకులు

ధాన్యం కొనుగోలులో సమస్యలపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తంచేశారు. ధాన్యం పట్టుబడులకు గోనె సంచులు ఇవ్వాలని, రవాణాకు లారీలు ఏర్పాటు చేయాలని, నూకశాతం పేరుతో రైతుల నుండి డబ్బు వసూలు ఆపాలని డిమాండ్ చేస్తూ ఎపి రైతు సంఘం, కౌలురైతుల సంఘం ఆధ్వర్యంలో కైకరం రైతు భరోసా కేంద్రం వద్ద రైతులు బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, కౌలు రైతుల సంఘం జిల్లా కన్వీనర్ కొర్ని అప్పారావు మాట్లాడుతూ ధాన్యం పట్టుబడులకు గోనె సంచులు ఇవ్వకపోవడంతో రైతులు రైతు భరోసా కేంద్రం చుట్టూ తిరగాల్సి వస్తోందని చెప్పారు. రైతులకు సరిపడు గోనె సంచులు అందించాలని కోరారు. ధాన్యం రవాణాకు లారీలు ఏర్పాటు చేయకపోవడం వల్ల అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ధాన్యం రవాణాకు సరిపడా లారీలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నూకశాతం పేరుతో రైతుల నుండి డబ్బు వసూలు దారుణమని విమర్శించారు. తూకంలో తేడాలు, నూక శాతం పేరుతో డబ్బులు వసూలు ఆపాలన్నారు. మారిన వాతావరణ పరిస్థితుల రీత్యా యుద్ధప్రాతిపదికన కల్లాల్లోని ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని కోరారు. ధాన్యం కొనుగోలు సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. రైతులు, కౌలు రైతులు ధర్నాకు దిగడంతో గోనెసంచులు అందించారు. కొనుగోలు కేంద్రం వద్దకు వచ్చిన తహశీల్దార్ ఎవి.రమణరావుకు రైతు సంఘం నాయకులు ధాన్యం కొనుగోలు సమస్యలను వివరించారు. దీనిపై స్పందించిన ఆయన సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతుల సంఘం జిల్లా కో కన్వీనర్ వెజ్జు శ్రీరామ చంద్రమూర్తి, రైతులు, కౌలురైతులు నెరుసు శ్రీనివాసరావు, తమ్మినీడి నాగేశ్వరరావు, జంగం దుర్గారావు, కర్రి చిన్నారావు, కొల్లాటి వీరబాబు, పెద్దింటి సోమేశ్వరరావు పాల్గొన్నారు.

రెవెన్యూ రికార్డులు గల్లంతు

ప్రజాశక్తి కథనంతో వెలుగులోకి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పట్టణంలోని అశ్వారావుపేటరోడ్డులోని సర్వే నెంబర్ 704లోని రెవెన్యూ రికార్డులు గల్లంతయ్యాయి. ఈ సర్వే నెంబరుకు సంబంధించిన ఆధారాలు లభించక రెవెన్యూ అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. ప్రభుత్వ రెవెన్యూ వెబ్‌లో 704లో ఉన్నట్లు చూపుతున్నప్పటికీ సంబంధిత రెవెన్యూ ఆధారాలు లభించకపోవడం పలు అనుమానాలకు దారితీస్తుందని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఇటీవల ప్రజాశక్తిలో 'ప్రభుత్వ స్థలాలపై పెద్దల కన్ను' కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన తహశీల్దారు స్లీవజోజి సంబంధిత ఆవసరాల కోసం అన్వేషించగా అసలు విషయం వెల్లడైంది. 704 సర్వే నెంబరులో ప్రభుత్వస్థలం ఎంత విస్తీర్ణం ఉందనే ఆధారాలు లేకపోవడం వల్ల ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అలాగే ఈ సర్వే నెంబరులో ప్రభుత్వ స్థలాల గుర్తింపుపై కసరత్తు మొదలుపెట్టారు. వాణిజ్యపరంగా స్థానిక అశ్వారావుపేటరోడ్‌లో స్థలాలకు అధిక డిమాండ్ ఏర్పడింది. దీంతో కొందరు అక్రమమార్గంలోనైనా ఈ స్థలాల ఆక్రమణకు వెనుకాడటం లేదని స్థానికులు పేర్కొంటున్నారు.

సర్వత్రా చర్చ

శరవేగంగా అభివృద్ధి చెందుతున్న జంగారెడ్డిగూడెంలో విలువైన ప్రభుత్వ స్థలాల అన్యాక్రాంతం చర్చనీయాంశంగా మారింది. ఇటీవల అశ్వారావుపేటరోడ్‌లో ప్రభుత్వ స్థలాల ఆక్రమణ, 704 సర్వే నెంబరు చర్చనీయాంశమైంది. ఈ ప్రాంతంలో ప్రభుత్వ స్థలాలకు నకిలీపత్రాలు సృష్టించే క్రమంలో 704 సర్వే నెంబరు సృష్టించబడిందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అశ్వారావుపేట రోడ్‌లో ప్రభుత్వ స్థలాలను అక్రమించిన కొందరు కుతంత్రాలతో గతంలో రెవెన్యూ అధికారులకు తాయిలాలు అందించి తమకు అనుకూలంగా రెవెన్యూ రికార్డులను తారుమారు చేయించారనే ఆరోపణలు కూడా వెల్లువెత్తుతున్నాయి. ఇక్కడి ప్రభుత్వస్థలాలను అడ్డగోలుగా సర్వేనెంబర్లు మార్పుచేసి అమ్మకాలు చేపట్టినట్లు తెలుస్తుంది. నామమాత్రంగా ఉన్న 704 సర్వే నెంబరు హద్దులు, విస్తీర్ణం, రెవెన్యూ ఆధారాలు ఎంత ప్రభుత్వ భూమి ఉందనే వాస్తవాలను గుర్తించడానికి రెవెన్యూ అధికారులు కసరత్తు మొదలుపెట్టారు. రెవెన్యూ రికార్డుల్లో సంబంధిత ఆధారాలు లేకుండా సర్వే నంబరు ఎలా వచ్చిందనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై తహశీల్దారు స్లీవజోజిని వివరణ కోరగా ఈ సర్వేనెంబర్‌కు సంబంధించిన రెవెన్యూ ఆధారాలు రికార్డుల్లో నమోదు కాలేదని గుర్తించామన్నారు. దీనిపై ప్రభుత్వ ఉన్నతాదికారులకు నివేదిక పంపామని తెలిపారు. వారి ఆదేశాల మేరకు సమగ్ర సర్వే చేసి ప్రభుత్వ స్థలాల వివరాలను ఉన్నతాధికారులకు అందిస్తామన్నారు.

అడిగిన వారికి 'ఉపాధి' చూపాలి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

అడిగిన వారందరికీ ఉపాధి పనులు కల్పించి, కూలీలకు మౌలిక వసతులు, పనిముట్లు, తాగునీరు, మజ్జిగ, చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సంఘం జిల్లా నాయకురాలు తామ ముత్యాలమ్మ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ ఎండల వల్ల ఉపాధి పనుల ప్రదేశాల్లో తగిన మౌలిక సదుపాయాల కల్పించాలని కోరారు. ఇప్పటికే గ్రామాల్లో పనుల్లేక కూలీలు పనులు కావాలని అడుగుతున్నప్పటికీ తీర్మానం చేసినప్పటికీ డిమాండ్ పనులు రాలేదని అధికారులు జాప్యం చేస్తున్నారని అధికారులపై మండిపడ్డారు. ఓ పక్క ఎండలు మండటం, గుణపంతో మట్టి పొడవడం వల్ల చేతులకు బొబ్బలు వచ్చి కూలీలు నరకం అనుభవిస్తున్నారని అవేదన వ్యక్తం చేశారు. కష్టపడి పని చేస్తున్నా లక్షల రూపాయలు ఉపాధి కూలీలకు వేతన బకాయిలు ఉండటం సిగ్గుచేటని విమర్శించారు. గ్రామాల్లో ఉపాధి హామీ సమస్యలు పరిష్కరించాలని పలుమార్లు రాష్ట్ర ప్రభుత్వానికి, అధికారులకు మొరపెట్టుకున్నప్పటికీ దున్నపోతు మీద వాన కురిసినట్లు వ్యవహరిస్తున్నారని ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చింతలపూడి, పోలవరం నియోజకవర్గాల్లో ఉపాధి హామీ పని ప్రదేశాల్లో యాత్రలు జరిపి ప్రజలందరినీ చైతన్యం చేసి త్వరలో జంగారెడ్డిగూడెం ఆర్‌డిఓ కార్యాలయం వద్ద రెండు వేల మందితో ధర్నా చేస్తామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు పెంచాలని, 200 రోజులు పనులు పెంచి, రూ.600 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం, జిల్లా కమిటీ సభ్యులు రాజమండ్రి దానియేలు, తుమ్మల సత్యనారాయణ, వై.నాగేంద్ర, అందుగుల ప్రభాకర్‌రావు, కారం దుర్గ, యాగంటి సీత, కారం భాస్కర్, పి.నాగేశ్వరరావు, కె.జలపాలు, కామన సత్యనారాయణ పాల్గొన్నారు.

ముసునూరు: ఉపాధి హామీ కూలీలకు వేసవి అలవెన్సులు అందజేయాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి పిల్లి మురళీ పేర్కొన్నారు. బుధవారం ముసునూరు, గోపవరం, బలివే, యల్లాపురం గ్రామాల్లోని ఉపాధి పనుల వద్ద కూలీలతో ఆయన మాట్లాడారు. పనిప్రదేశంలో వైద్య కిట్లు ఏర్పాటు చేయడం లేదని, పనికి తగ్గ వేతనం ఇవ్వడం లేదని, కనీసం తాగునీరు కూడా ఏర్పాటు చేయకపోవడం అన్యాయమన్నారు.

'ఉపాధి' లక్ష్యంపై అధికారులు దృష్టి పెట్టాలి : కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో జరుగుతున్న ఉపాధి హామీ పనులకు ప్రతి మండలానికి రోజువారీ లక్ష్యాలను నిర్దేశించి అందుకు అనుగుణంగా కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా, మండలస్థాయి అధికారులతో వివిధ అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీగ్రామంలో ఉపాధి పనులు కల్పించాలని, ఎక్కడాకూడా జీరో మాన్ డేస్ నమోదు కాకూడదన్నారు. జిల్లాకు నిర్దేశించిన 1.45 కోట్ల పని దినాల లక్ష్యాన్ని చేరుకోవడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. పనిచేసే ప్రాంతాల్లో తాగునీరు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు, షామియానాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అమృత్ సరోవర్‌లో అభివృద్ధి చేస్తున్న చెరువులను మే 15 నాటికి పూర్తి చేయాలన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య లోపం స్పష్టంగా కనబడుతుందని దీనిపై అధికారులు దృష్టి పెట్టాలన్నారు. మండలంలో విజిబుల్ శానిటేషన్‌కు రోజువారీ ప్రణాళికలు సిద్ధం చేసుకుని పారిశుధ్య పనులను చేపట్టాలని ఎంపిడిఒలను ఆదేశించారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ ఎస్ఇ జిసి.భాస్కర్‌రెడ్డి, డ్వామా పీడీ రాము, డిపిఒ విజయలక్ష్మి, డిఎల్‌డిఒ రమణ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మేడే వేడుకలు ఘనంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

వచ్చేనెల ఒకటో తేదీన ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని వాడవాడలా ఘనంగా నిర్వహించాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఎం.నాగమణి పిలుపునిచ్చారు. ఈ మేరకు గోడపత్రికను సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం విడుదల చేశారు. ఈ సంద ర్భంగా నాగమణి మాట్లాడారు. ఎనిమిది గంటల పని విధానం సాధించుకునేందుకు కార్మికవర్గం ఎన్నో బలి దానాలు చేసిందని, అమెరికాలోని చికాగో నగరంలో జరిగిన ఉద్యమాల్లో, రక్తతర్పణాలతో ఎర్రజెండా ఆవిర్భవించిందని, ఎనిమిది గంటల పని విధానం సాధించుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షురాలు కె.పుష్ప, వాణి, నిర్మల, రామలక్ష్మి పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్ : మేడే సందర్భంగా ఐఎఫ్‌టియు రాష్ట్ర కమిటీ ముద్రించిన వాల్‌పోస్టర్లను ఏలూరు మార్కెట్ యార్డు హమాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టియు రాష్ట్ర సహాయ కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, యార్డ్ హమాలీ వర్కర్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ కార్మికవర్గం తరతరాలుగా పోరాడి సాధించుకున్న హక్కులు, సౌకర్యాలు, రాయితీలను మోడీ ప్రభుత్వం రద్దుచేయడం దుర్మార్గమని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఇఫ్టూ నగర ప్రధాన కార్యదర్శి యర్రా శ్రీనివాసరావు, యార్డ్ హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు సిహెచ్.నూకరాజు, గంగరాజు పాల్గొన్నారు.

కుక్కునూరు : మేడే వేడుకలను కార్మికులు ఘనంగా నిర్వహించాలని సిఐటియు మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్ పిలుపునిచ్చారు. స్థానిక సుందరయ్య భవనం ప్రజాసంఘాల కార్యాలయంలో బుధవారం సిఐటియు రెండో రోజు శిక్షణా తరగతుల ముగింపు సందర్భంగా సాయికిరణ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు కుంజా నాగలక్ష్మి, నాయకులు కారం రాజేశ్వరి, వేల్పుల శివ, బి.సుజాత, సురేష్, వెంకటేశ్వర్లు, ఎస్‌కె.వలీ పాషా, రమాదేవి, దుర్గమ్మ పాల్గొన్నారు.

నిడమర్రు: మేడే వేడుకలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణారావు పిలుపునిచ్చారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో. సిఐటియు మండల కమిటీ సమావేశం పిల్ల హరికుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో రమణరావు మాట్లాడారు. ఈ సమావేశంలో కంచం వర ప్రసాద్, కోన శ్రీనివాసరావు, సోడాబత్తుల వాసు, దేవుని విజయలక్ష్మి, జి.మల్లేశ్వరి, హరిప్రసాద్ పాల్గొన్నారు.

విద్యుత్ ఫ్యూజ్‌బాక్స్ సమస్య పరిష్కారం

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - ముదినేపల్లి

స్థానిక కైకలూరు రోడ్డులోని పెయ్యేరు పంచాయతీ పరిధిలో వైఎస్ఆర్ కాలనీలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ఫ్యూజ్‌బాక్స్‌ను గ్రామ పంచాయతీ విద్యుత్ సిబ్బంది ఎత్తులో ఏర్పాటు చేశారు. ఈ నెల 24వ తేదీన సోమవారం ప్రజాశక్తి దినపత్రికలో వైఎస్ఆర్ కాలనీలో ప్రమాదకరంగా విద్యుత్ ఫ్యూజ్‌బాక్స్ శీర్షికతో వార్త ప్రచురితమైంది. దీనిపై పెయ్యేరు గ్రామ పంచాయతీ కార్యదర్శి వై.శ్యామ్‌సుందర్ స్పందించారు. గ్రామ పంచాయతీ విద్యుత్ సిబ్బందితో స్తంభానికి రెండు అడుగుల తక్కువ ఎత్తులో ప్రమాదకరంగా ఉన్న ఫ్యూజ్‌బాక్స్‌ను ఐదు అడుగుల ఎత్తులో ఏర్పాటు చేయించారు. సమస్య పరిష్కారం కావడంతో కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేశారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం

ప్రజాశక్తి - ముదినేపల్లి

అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన రెండు కుటుంబాలకు పలువురు తమవంతు సాయం అందించారు. మండలంలోని కొరగుంటపాలెం పంచాయతీ శివారు రాజనగరానికి చెందిన నాయుడు రామారావు, నాయుడు లక్ష్మీనారాయణ నిరుపేద కుటుంబాలకు చెందిన వ్యక్తులు. వీరు ఉదయం పొలం పనుల నిమిత్తం బయటకు వెళ్లారు. ఆ సమయంలో వీరు నివాసం ఉంటున్న రెండు పూరిళ్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి దగ్ధమయ్యాయి. రెండు కుటుంబాలకు చెందిన వ్యక్తులు సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలారు. ఈ విషయం తెలుసుకున్న అమరావతి మాజీ బ్రాండ్ అంబాసిడర్, వైద్య విద్యార్థిని అంబుల వైష్ణవి తన తండ్రి డాక్టర్ మనోజ్ ద్వారా అగ్ని బాధిత కుటుంబాలకు ఒకొక్క కుటుంబానికి రూ.ఐదు వేల నగదు, నెలకు సరిపడ బియ్యం, నిత్యవసర సరుకులు అందించారు. టిడిపి యువనేత కొడాలి వినోద్ విషయం తెలుసుకుని పార్టీ నాయకులతో కలిసి వెళ్లి అగ్ని ప్రమాద బాధితులను పరామర్శించారు. బాధితులకు రూ.15 వేల నగదు రెండు కుటుంబ సభ్యులకు అందించారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ద్వారకాతిరుమల వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో నిత్యాన్నదాన ట్రస్టుకు పశ్చిమగోదావరి జిల్లా అడవిపాలెం గ్రామానికి చెందిన గోటేటి సత్యనారాయణమూర్తి బుధవారం రూ.51,116 విరాళం అందించారు. దేవస్థానం ఎఇఒ మెట్టపల్లి దుర్గారావుకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చెక్ ద్వారా ఈ విరాళం అందించారు. అనంతరం దాత కుటుంబసభ్యులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. వీరికి దేవస్థానం వారు అన్నదానం బాండ్ పేపర్ అందించారు.

విద్యార్థులకు విలువలు నేర్పాలి

ప్రజాశక్తి - చింతలపూడి

విద్యార్థులకు బాల్యం నుంచే విలువలను, క్రమశిక్షణను, జ్ఞానాన్ని అందించాలని శ్రీచైతన్య టెక్నో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.సత్యనారాయణ అన్నారు. స్థానిక శ్రీ చైతన్య టెక్నో స్కూల్‌లో బుధవారం ప్రీ ప్రైమరీ, ప్రైమరీ గ్రాడ్యుయేషన్ కార్యక్రమం నిర్వహించారు. యుకేజీ పూర్తి చేసుకుని మొదటి తరగతికి అర్హత పొందిన పిల్లలకు, ఐదో తరగతి పూర్తి చేసుకుని ఆరో తరగతికి ప్రమోట్ అయిన విద్యార్థులకు గోల్డ్‌మెడల్, ప్రశంసాపత్రాలను ప్రధానోపాధ్యాయులు బి.సత్యనారాయణ చేతులమీదుగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సాధించిన విజయాలకు నిరంతర ప్రోత్సాహకాలు ఇవ్వడం ద్వారా వారితో మంచి ఫలితాలు తీసుకురావచ్చనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రీజనల్ ఇన్‌ఛార్జి పార్థసారధి, ప్రైమరీ ఇన్‌ఛార్జి ఝాన్సీ, డీన్ మధుబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రత్యేక బహుమతులు

ప్రజాశక్తి - ముసునూరు

విద్యార్థులందరూ ప్రాథమిక దశ నుంచే చదువు పట్ల అవగాహన కలిగి ఉండాలని హరిశ్చంద్రపురం ఉపాధ్యాయులు తూమాటి విజయలక్ష్మి అన్నారు. మండలంలోని గోపవరం ఎస్‌సి ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రత్యేక బహుమతులు అందిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ బహుమతుల ప్రదానోత్సవం గత మూడేళ్ల నుంచి ప్రోత్సాహక బహుమతుల రూపంలో అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముసునూరు సిల్క్ నగర్ పాఠశాల ప్రదానోపాధ్యాయులు కొప్పల బాబురావు, ఇతర ఉపాధ్యాయులు సురేష్, సలోమి, విద్యార్థులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

రైల్వే గేటును ఢీ కొట్టిన ట్రాక్టర్

ప్రజాశక్తి - మండవల్లి

మితిమీరిన వేగంతో వస్తున్న ట్రాక్టర్ ప్రమాదవశాత్తూ మూసి ఉన్న రైల్వే గేటును ఢీకొట్టి పట్టాలపై అడ్డంగా నిలిచిన సంఘటన భైరవపట్నం రైల్వే గేటు వద్ద బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు, గేట్ మెన్ తెలిపిన వివరాల ప్రకారం... గురజ నుంచి వస్తున్న ట్రాక్టర్ మితిమీరిన వేగంతో వస్తూ గుడివాడ వైపు ఉన్న రైల్వే గేటును బలంగా ఢీకొట్టింది. అప్పటికీ ట్రాక్టర్ కంట్రోల్ కాకపోవడంతో దూసుకుంటూ వెళ్లి రైల్వే పట్టాల మధ్యలో ఇరుక్కుపోయింది. ఇది గమనించిన గేట్‌మెన్ రైలు రాకుండా నిలుపుదల చేసేవిధంగా రెడ్ సిగ్నల్ ఇచ్చాడు. అదే సమయంలో భీమవరం నుంచి విజయవాడకు వెళుతున్న మరో రైలు మరో రైల్వే ట్రాక్ మీద నుంచి వస్తుంది. దీంతో గేట్‌మెన్ రెడ్ సిగ్నల్ వేసి ఆ రైలు ఆగేలా చేశాడు. పెను ప్రమాదం తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. స్థానికులు, వాహనదారులు హుటాహుటిన పట్టాల మధ్య ఇరుక్కుపోయిన ట్రాక్టర్ పక్కకు తొలగించి రైళ్ల రాకపోకలను పునరుద్ధరించారు. రోడ్డుకు ఇరువైపులా భారీ స్థాయిలో వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్ పూర్తిస్థాయిలో స్తంభించిపోయింది. రాకపోకలు సాగించేందుకు వాహనదారులు నానా అవస్థలు పడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

గుర్తు తెలీని వాహనం ఢీ కొని వృద్ధుడికి గాయాలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

గుర్తు తెలీని వాహనం ఢీ కొని వ్యక్తి తలకు తీవ్ర గాయమైన ఘటన మండలంలోని పి.అంకంపాలెం గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన ఇళ్ల రామకృష్ణ (70) పొలం వెళ్లి పని చూసుకొని ద్వి చక్రవాహనంపై ఇంటికి తిరిగి వస్తుండగా మార్గమధ్యలో గుర్తు తెలీని వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రామకృష్ణ గాయాలపాలై స్పృహ తప్పి రోడ్డుపై పడిపోయాడు. ఇది గమనించిన అతని కుటుంబసభ్యులు 108కు ఫోన్ చేయగా అందుబాటులో లేకపోవడంతో ఆటోలో జీలుగుమిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం జంగారెడ్డిగూడెం సాయి స్ఫూర్తి ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

తేనెటీగల దాడిలో ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

తేనెటీగల దాడిలో ముగ్గురు గాయాలపాలయ్యారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో చెట్టుపై ఉన్న తేనెటీగలు ఒక్కసారిగా అటుగా వెళ్తున్న మంగ అనే మహిళపై దాడి చేయడంతో మహిళ కింద పడిపోయింది. అలాగే పాఠశాలకు వస్తున్న ఇద్దరి పిల్లలపై కూడా దాడి చేయడంతో వారు పరుగులు తీశారు. కింద పడిపోయిన మహిళను స్థానికులు జీలుగుమిల్లి ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఉదయం సమయం కావడంతో ఇంకా పిల్లలందరూ పాఠశాలకు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

ఆర్‌టిసి బస్సును ఢీకొట్టిన లారీ

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఆర్‌టిసి బస్సును లారీ ఢీకొట్టిన ఘటన మండలంలోని పెదపాలపర్రు వద్ద పామర్రు-దిగమర్రు 165 రహదారిలో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం... భీమవరం డిపోకు చెందిన ఆర్‌టిసి బస్సు భీమవరం నుంచి విజయవాడ వెళ్తుంది. ఈ క్రమంలో మండలంలోని పెదపాలపర్రు సెంటర్ వద్దకు వచ్చేసరికి వెనుక వస్తున్న లారీ డ్రైవర్ బస్సును ఓవర్‌టేక్ చేయబోయి ఢీకొట్టాడు. ఈ ఘటనలో బస్సు వెనుక భాగం దెబ్బతింది. బస్సులో ఉన్న 26 మంది ప్రయాణికులంతా క్షేమంగా బయటపడ్డారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

అన్నదాత.. ఆందోళన..!

ధాన్యం రవాణాలో తప్పని ఇబ్బందులు

కొనుగోలు లక్ష్యాన్ని కుదించిన పౌర సరఫరాల శాఖ

అందుబాటులో లేని లారీలు

భీమడోలులో లారీలో ఎగుమతి చేస్తున్న ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఉషారాణి

ప్రజాశక్తి - భీమడోలు

ధాన్యం కొనుగోళ్ల విషయమై రైతు భరోసా కేంద్రాలు, కొనుగోళ్లకు ప్రత్యేకించిన ఏజెన్సీలు పెట్టిన షరతులకు అనుగుణంగా ధాన్యాన్ని రవాణాకు రైతులు సిద్ధం చేశారు. రవాణా కోసం ప్రత్యేకించిన లారీలు అవసరమైన సంఖ్యలో అందుబాటులో లేకపోవడంతో రైతులకు ఇబ్బందులు తప్పడంలేదు. వాతావరణ మార్పుల నేపథ్యంలో ఆందోళన చెందుతున్నారు. మండలంలో 14 రైతు భరోసా కేంద్రాలు, నాలుగు ఏజెన్సీల ద్వారా ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నాయి. ప్రస్తుతం వచ్చిన దిగుబడుల ఆధారంగా ఒక్కొక్క రైతు భరోసా కేంద్రానికి 20 లారీల వంతున డిమాండ్ మేరకు రవాణా కోసం ప్రత్యేకించాలి. కానీ మండలంలో మంగళవారం సాయంత్రానికి మొత్తంగా వంద లారీలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఇది కూడా రైతులు పురుగుల మందు డబ్బాలు పట్టుకుని ఆందోళనలు చేపట్టిన తర్వాత మాత్రమే జరిగింది. ఈ నేపథ్యంలో ఎప్పటికప్పుడు వారి సమస్యల పరిష్కారానికి హామీ ఇస్తున్న అధికారులు వాటిని నెరవేర్చటంలో విఫలం చెందిన కారణంగానే అవసరమైన సంఖ్యలో రవాణా కోసం ప్రత్యేకించిన లారీలు రాలేదని రైతులు అంటున్నారు. రైతుల ఆందోళనతో కొన్ని ఏజెన్సీలు వారి సమస్యల పరిష్కారానికి ముందుకు వచ్చారు. ఒక ఏజెన్సీ తమ సొంత బాధ్యతపై రవాణా ఛార్జీలు చెల్లిస్తూ ధాన్యాన్ని తరలిస్తున్నారు. ఈ మొత్తాలను రైతుల నుంచి వసూలు చేస్తున్నారు. ఇంకొక ఏజెన్సీలో ఇప్పటివరకు కేవలం పది శాతం మాత్రమే ధాన్యం రవాణా జరగడంతో ట్రాక్టర్లను ఏర్పాటు చేశారు. వీటన్నింటికీ రైతుల నుంచి ముందస్తుగా సొమ్ములను తీసుకుంటున్నారు. లేదా వారి సొసైటీ ఖాతాలో అప్పుగా రాస్తున్నారు. వారికి బిల్లులు వచ్చిన తర్వాత తిరిగి చెల్లిస్తామని హామీ ఇస్తున్నారు. దీనిని బట్టి ధాన్యం రవాణా బాధ్యత రైతుల నెత్తిన పడింది. మండలంలో 13,120 ఎకరాల్లో వరిసాగు జరిగింది. 57 వేల మెట్రిక్ టన్నుల వరకు దిగుబడి వస్తుందని అంచనా వేసిన వ్యవసాయ అధికారులు రైతుల నుంచి ప్రతి గింజ కొంటామంటూ హామీ ఇస్తూ కొనుగోళ్లకు తమ వంతు సహకారాన్ని అందిస్తున్నారు. ఇదే నేపథ్యంలో పౌరసరఫరాల శాఖ మండలంలో ధాన్యం కొనుగోలు లక్ష్యాన్ని 33,243 మెట్రిక్ టన్నులకు కుదించింది. దీంతో చివరలో ధాన్యం అమ్మేందుకు సిద్ధపడిన రైతులు పౌరసరఫరాల శాఖ నిర్ణయించిన లక్ష్యం పూర్తయితే తమ ధాన్యం ఎవరు కొంటారంటూ ఆందోళన చెందుతున్నారు. ఇప్పటివరకు మండలంలో 7,847 మెట్రిక్ టన్నుల ధాన్యం రవాణా జరిగింది. 5,300 ఎకరాల సాగు విస్తీర్ణం గల పూళ్ల సొసైటీ ఏజెన్సీ ఇప్పటివరకు 3,716 టన్నుల ధాన్యాన్ని రవాణా చేసింది. భీమడోలు సొసైటీ 1,862 టన్నులు ధాన్యాన్ని రవాణా చేసింది. ఇక అతి తక్కువగా గుండుగొలను సొసైటీ 866 టన్నుల ధాన్యాన్ని మాత్రమే రవాణా చేసింది. ఇది వారికి నిర్దేశించిన కొనుగోలు లక్ష్యంలో పది శాతం మాత్రమే. వీటికి అదనంగా భీమడోలు ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ (నాబార్డ్ అనుబంధం) తమకు కేటాయించిన గ్రామాల నుంచి 1,400 టన్నుల ధాన్యాన్ని మాత్రమే సేకరించి రవాణా చేసింది.

మెట్ట ప్రాంతంలో ధాన్యం ముక్క సమస్య

మండలంలోని మెట్ట ప్రాంతంలో ఎండల కారణంగా దిగుబడి వచ్చిన ధాన్యం ఆరుదల ఎక్కువగా ఉండటంతో ముక్క శాతం పెరిగింది. షరతుల మేరకు 42 శాతం వరకు ముక్క ఉన్న ధాన్యాన్ని మిల్లర్లు అభ్యంతరం చెప్పకుండా తీసుకోవాల్సి ఉంది. కాని ఈ విషయంలో కొంత మాయాజాలం జరుగుతుందన్న ఆరోపణలు ఉన్నాయి. మిల్లర్లు ఈ తరహాగా వచ్చిన ధాన్యంలో ముక్క శాతం ఎక్కువగా ఉందంటూ రైతుల నుంచి ఆ మేరకు సొమ్ములు తీసుకున్న తర్వాత ధాన్యాన్ని దిగుమతి చేసుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయా లపై ఏజెన్సీలను ప్రశ్నించడం కొన్ని మెట్ట ప్రాంతాల్లో ముక్క శాతం ఎక్కువగానే ఉందని, నిర్దేశించిన శాతం కన్నా ముక్క ఎక్కువగా ఉంటే మిల్లర్లు ధాన్యం దిగుమతి చేసుకునేందుకు ఇబ్బందులు పెడుతున్నారని తెలిపారు. మండలంలోని రైతులను ఆదుకునేందుకు వారి అవసరాలకు సరిపడా లారీలను రవాణా కోసం ప్రత్యేకించాలని, మెట్ట ప్రాంతంలోని దిగుబడిని ముక్క శాతంతో నిమిత్తం లేకుండా కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

ఇంటర్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

గీతాంజలి జూనియర్ కాలేజీ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురం గీతాం జలి జూనియర్ కాలేజీ 2022-23 ఇంటర్ ఫలితాల్లో ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఉంగుటూరుకు చెందిన విద్యార్థిని ఎన్.రేవతివెంకటదుర్గ ఎంపిసిలో 961 మార్కులు సాధించి కాలేజీ ప్రథమ స్థానంలో నిలిచింది. మోరు స్వాతి సిఇసిలో 427 మార్కులు సాధించి కాలేజీ ప్రథమ స్థానంలో నిలిచింది. మొత్తం ప్రథమ సంవత్సరం ఉత్తీర్ణత 55 శాతం, ద్వితీయ సంవత్సరం 70 శాతంగా ఉందని ప్రిన్సిపల్ సుబ్రహ్మణ్యం తెలిపారు.

మహాత్మ గాంధీ జూనియర్ కాలేజీ విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురం మహ్మాత గాంధీ ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో మెరుగైన ప్రతిభ చూపారని ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ శ్రీనివాసు చెప్పారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో మొత్తం 336 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 166 మంది ఉత్తీర్ణులయ్యారు. కళాశాల టాపర్‌గా ఎంపిసి విద్యార్థి 931 (93.1 శాతం) మార్కులు సాధించిందన్నారు. సబ్జెక్టు వారీగా కాలేజీ టాపర్‌ను అభినందించారు. సెంకండ్ ఇయర్ బైపిసి టాపర్ జె.దేవీశ్రీలక్ష్మి 847 మార్కులు, ఫస్ట్ ఇయర్ బైపిసిలో 452 మార్కులతో జి.హసిని ప్రతిభ కనబర్చారని తెలిపారు.

గురుకుల విద్యార్థులు 62 శాతం ఉత్తీర్ణత

జంగారెడ్డిగూడెం :సీనియర్ ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో స్థానిక ఉప్పలమెట్ట డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల కళాశాల విద్యార్థినిలు 62 శాతం ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపల్ అరుణ తెలిపారు. డాక్టర్ బిఆర్.అం బేద్కర్ గురుకుల కళాశాలలో సీనియర్ ఇంటర్ విద్యార్థులు 66 మంది పరీక్షలకు హాజరు కాగా 41 మంది ఉత్తీ ర్ణత సాధించారని తెలిపారు. జూనియర్ ఇంటర్ పరీక్ష ఫలి తాల్లో 56 మందికి 24 మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలి పారు. జూనియర్ ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత 44 శాతం వచ్చి నట్లు తెలిపారు. జూనియర్ ఇంటర్ సిఇసి విభాగంలో అనూ ష 467, సీనియర్ ఇంటర్ సిఇసి విభాగంలో హేమశ్రీ 861 అత్యధిక మార్కులు సాధించారని ప్రిన్సిపల్ అరుణ తెలిపారు.

జీలుగుమిల్లి : జీలుగుమిల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో 28 మంది పరీక్షలు రాయగా 14 మంది ఉత్తీర్ణులయ్యారని ప్రిన్సిపల్ ఆలి మొహిద్దీన్ తెలిపారు. బర్రింకలపాడు గురుకుల కళాశాల ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 74 మందికి 30 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు.

మద్ది ఆలయాన్ని సందర్శించిన మంత్రి కారుమూరి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని గురవాయిగూడెం మద్ది ఆంజనేయ స్వామి ఆలయాన్ని పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు సందర్శించారు. బుధవారం ఆలయానికి వచ్చిన మంత్రి కారుమూరికి, ఎంఎల్‌ఎలకు ఆలయ కార్యనిర్వహణాధికారి కొండలరావు స్వాగతం పలికారు. ఆలయ మర్యాదలతో సత్కరించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వారితో పాటు జెడ్‌పిటిసి సభ్యులు పోల్నాటి బాబ్జి, స్త్రీ శిశుసంక్షేమ శాఖ రీజనల్ అధ్యక్షురాలు వందనపు సాయిబాల పద్మ, గురవాయిగూడెం సర్పంచి గుబ్బల సత్యవేణి, ఎంపిటిసి సభ్యులు కొయ్యా రామారెడ్డి, ధర్మకర్తల మండలి అధ్యక్షురాలు కీసరి సరిత విజయ భాస్కరరెడ్డి పాల్గొన్నారు.

గొల్లగూడెంలో ప్రత్యేక ఆధార్ నమోదు శిబిరం

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్(కాఫ్)ఆధ్వర్యంలో బాలబాలికలకు ఆధార్ నమోదు కోసం ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేయటం ఎంతో అభినందనీయమని గొల్లగూడెం గ్రామ సర్పంచి లింగవరపు రమేష్ అన్నారు. మండలంలోని గొల్లగూడెం గ్రామ సచివాలయంలో కాఫ్ ఆధ్వర్యంలో గొల్లగూడెం సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ కె.అనూష సహకారంతో ఆధార్ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎం.శ్రీనివాసు, గ్రేడ్-5 కార్యదర్శి నాగేంద్రబాబు, మహిళా సంరక్షణ కార్యదర్శి మృణాళిని, కాఫ్ జిల్లా కో-ఆర్డినేటర్ పి.దివ్య పాల్గొన్నారు.

తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు ప్రభుత్వ బోధనాసుపత్రి ఉన్న రెడ్ క్రాస్ తలసేమియా భవనంలో బుధవారం తొమ్మిది మంది తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి నిర్వహించినట్లు జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ తలసేమియా వ్యాధి గల చిన్నారుల్లో హిమోగ్లోబిన్ తగినంత ఉత్పత్తి కాకపోవడం జరుగుతుందని, అందువల్ల పిల్లలు శారీరక, మానసిక ఎదుగుదలలో లోపాలు ఏర్పడతాయన్నారు. ప్రత్యామ్నాయంగా నెలకు రెండుసార్లు రక్తమార్పిడి చేయించుకోవాల్సి ఉంటుందని, ప్రతిఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసి తలసేమియా చిన్నారులను ఆదుకోవాలని కోరారు. ఈ సందర్భంగా తలసేమియా చిన్నారులతో పాటు వారి తల్లిదండ్రులు 25 మందికి ఉచిత భోజనం ఏర్పాటుచేసిన ఏలూరు మానవత సభ్యులు పరసా శ్రీనివాసరావుకు అభినందనలు తెలిపారు.

1 నుంచి లూర్దు మాత మహోత్సవాలు

ప్రజాశక్తి - మండవల్లి

లూర్దు మాత ఉత్సవాల్లో పాల్గొని ప్రతిఒక్కరూ మేరీమాత దీవెనలు పొందాలని భైరవపట్నం విచారణ కర్త రెవరెండ్ ఫాదర్ నూతలపాటి కిషోర్ తెలిపారు. స్థానిక చర్చిలో బుధవారం విలేకర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భైరవపట్నంలోని లూర్దు మాత మహోత్సవాలను వచ్చే నెల 1, 2, 3 తేదీల్లో ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేశామన్నారు. ఈ ఉత్సవాల్లో విజయవాడ మేత్రాసన పీఠాధిపతులు మహాగణ తెలుగ తోటి జోసెఫ్ రాజారావు పాల్గొంటారన్నారు. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రామకృష్ణ, రత్న కుమార్, బేతపూడి ఏసేబురాజు పాల్గొన్నారు.

గ్రామస్తుల సహకారంతోనే అభివృద్ధి

శ్రీనివాసరావును అభినందిస్తున్న ఎంపిపి

ప్రజాశక్తి - మండవల్లి

గ్రామాభివృద్ధికి గ్రామస్తుల సహకారం ఎంతో అవసరమని ఎంపిపి పెద్దిరెడ్డి శ్రీరామ దుర్గాప్రసాద్ అన్నారు. స్థానిక నాగేంద్ర స్వామి దేవస్థానంలో ఆరోగ్యవంతమైన ఉత్తమ పంచాయతీగా మండవల్లి పంచాయతీకి అవార్డు వచ్చినందుకు బుధవారం నిర్వహించిన అభినందన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రామం అభివృద్ధి చెందాలంటే గ్రామస్తుల భాగస్వామ్యం అవసరమన్నారు. కార్యదర్శి తోట శ్రీనివాసరావు మాట్లాడుతూ తన కన్నా ముందు విధులు నిర్వహించిన కార్యదర్శుల కృషి, పారిశుధ్య కార్మికుల కృషి ఎంతో ఉందన్నారు. వారి కృషి వల్లే మండవల్లి పంచాయతీకి ఆరోగ్యవంతమైన పంచాయతీగా అవార్డు దక్కిందన్నారు. మండవల్లి పంచాయతీని మరింత అభివృద్ధిలో ముందుంచే విధంగా విధులు నిర్వహిస్తామని చెప్పారు. అనంతరం మెండ ఝాన్సీ కార్యదర్శి తోట శ్రీనివాసరావును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి జొన్నలగడ్డ నాగలక్ష్మి, చేయబోయిన వీర్రాజు, సుధా బత్తుల విజయ్‌కుమార్, గంగునేని వరప్రసాద్, ఎల్ఎస్.భాస్కరరావు. మెండ సురేష్, ముంగర మల్లికార్జునరావు, బొంగ రాణి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

సర్పంచి బాలాజీకి ఎంఎల్‌ఎ వాసుబాబు అభినందన



సర్పంచిని అభినందిస్తున్న ఎంఎల్‌ఎ వాసుబాబు

ప్రజాశక్తి - భీమడోలు

సూరప్పగూడెం రాష్ట్రస్థాయిలో ఉత్తమ గ్రామ పంచాయతీగా ఎంపికైన నేపథ్యంలో సర్పంచి వెజ్జు బాలాజీనాయుడును ఎంఎల్‌ఎ పుప్పాల వాసుబాబు బుధవారం అభినందించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో ఉత్తమ గ్రామపంచాయతీలుగా ఎంపిక చేయడానికి ప్రామాణికంగా తీసుకున్న తొమ్మిది అంశాల్లో ఒక అంశంలో సూరప్పగూడెం గ్రామపంచాయతీ రాష్ట్రస్థాయి ఉత్తమ గ్రామ పంచాయతీగా ఎంపికయ్యిందని, రానున్న కాలంలో అన్ని అంశాల్లో ఉత్తమ గ్రామపంచాయతీగా ఎంపిక కావాలని కోరారు. దీనికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. సూరప్పగూడెం గ్రామపంచాయతీ మండల పరిధిలోని ఇతర గ్రామపంచాయతీలకు ఆదర్శంగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో భీమవరం మల్లికార్జునరావు, సూరప్పగూడెం ఎంపిటిసి సభ్యులు ఇంజేటి జూనియర్, గ్రామపంచాయతీ కార్యదర్శి ముత్తయ్య, గ్రామ రెవెన్యూ అధికారి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మా గోడు వినండయ్య..!

మంత్రి కారుమూరి, ఎంఎల్‌ఎ ఎలిజా వద్ద దళిత మహిళల ఆవేదన



మంత్రితో మాట్లాడుతున్న మహిళలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మా గోడు వినండయ్యా అంటూ మండలంలోని దేవునిపల్లి గ్రామానికి చెందిన దళిత మహిళలు మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఎంఎల్‌ఎ ఉన్నమట్ల ఎలిజాలను వేడుకున్నారు. మండలంలోని శ్రీనివాసపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన హెల్త్‌సెంటర్, రైతు భరోసా కేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమానికి పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఎంఎల్‌ఎ ఎలిజా పాల్గొన్నారు. ఈ క్రమంలో దేవులపల్లి గ్రామం నుంచి వచ్చిన కొలుకులూరి దుర్గమ్మ, కొలుకులూరి శశిరేఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావుకు తమ గోడు వినిపించారు. దేవులపల్లి గ్రామంలో తమ తాతల కాలం నుంచి సాగు చేస్తూ మూడు కుటుంబాలకు జీవనాధారమైన 1.20 సెంట్ల భూమిని చెరువు పూడిక పేరుతో తవ్వేస్తున్నారని తెలిపారు. తమ గ్రామ సర్పంచి, మరికొందరు వాళ్ల స్వార్థానికి చెరువులో మట్టి తోలకాలు జరిపి గోతులు చేశారని తెలిపారు. ఇటీవల ప్రభుత్వ అధికారులు ఆ గోతులను పూడ్చాలని చెప్పడంతో సమీపంలో ఉన్న తమ భూమిని తవ్వి చెరువులో ఏర్పడ్డ గోతులు పూడ్చడానికి సంసిద్ధమయ్యారని వాపోయారు. తమ జీవనాధారాన్ని కాపాడాలని వేడుకున్నారు. దీనిపై మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఎంఎల్‌ఎ ఎలిజాలు స్పందించి దళితులు సాగు చేస్తున్న భూమి జోలికి వెళ్లవద్దని స్థానిక తహశీల్దార్ స్లీవజోజిని ఆదేశించారు. అనంతరం దళిత మహిళలు మంత్రి కారుమూరి నాగేశ్వరరావుకు, ఎంఎల్‌ఎ ఎలిజాలకు కృతజ్ఞతలు తెలిపారు.

29న టిడిపి జోన్-2 బిసిల రౌండ్‌టేబుల్ సమావేశం

ప్రజాశక్తి - భీమడోలు

కాకినాడలో ఈ నెల 29వ తేదీన నిర్వహించే టిడిపి జోన్-2 స్థాయి బీసీల రౌండ్ టేబుల్ సమావేశం విజయవంతం చేయాలని టిడిపి ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు కోరారు. ఈ మేరకు భీమడోలులోని పార్టీ కార్యాలయంలో పార్లమెంటరీ నియోజకవర్గ స్థాయిలోని పార్టీకి చెందిన ముఖ్య నాయకులతో బుధవారం ఆయన సమావేశమై చర్చించారు. శ్రీకాకుళం నుంచి ఏలూరు జిల్లా వరకు అన్ని జిల్లాలను టిడిపి జోన్-2 గా పార్టీ పరిగణిస్తుందన్నారు. రౌండ్ టేబుల్ సమావేశం కాకినాడ బస్టాండ్ సమీపంలో సూర్య ఫంక్షన్ హాలులో ఉదయం పది గంటలకు ప్రారంభమవుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మాజీ మంత్రులు, పార్టీ ప్రముఖులు కె.అచ్చెన్ననాయుడు, కొల్లు రవీంద్ర, యనమల రామకృష్ణుడు, చింతకాయల అయ్యన్నపాత్రుడు, పితాని సత్యనారాయణ హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్డి శ్రీనివాస చక్రవర్తి, ఇప్పిలి వెంకటేశ్వరరావు, కరణం పెద్దిరాజు, డి.పుల్లయ్య నాయుడు పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదుపై తహశీల్దార్ విచారణ

ప్రజాశక్తి - నూజివీడు

పట్టణ పరిధిలోని ఎంఆర్.అప్పారావు కాలనీ లే అవుట్లలో అంతర భాగంగా ఉన్న ఇంటి స్థలాలను, ఆ పక్కనే ఉన్న రోడ్డును కూడా దౌర్జన్యంగా కలుపుకొని ఫెన్సింగ్ వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు. నూజివీడు సబ్ కలెక్టర్‌కి ఈ విషయమై గత సోమవారం పలువురు కాలనీవాసులు స్పందనలో ఫిర్యాదు చేయడంతో దీనిపై నూజివీడు తహశీల్దార్‌ని విచారణ చేసి నివేదిక సమర్పించాలని సబ్ కలెక్టర్ ఆదేశించారు. దీనిపై నూజివీడు తహశీల్దార్ ఎల్లారావు కాలనీవాసులను బుధవారం తన కార్యాలయానికి పిలిపించి విచారణ జరిపారు. తమ స్థలాలను ఆక్రమించి ఫెన్సింగ్ వేస్తున్నారని పలుమార్లు ఫిర్యాదులు చేసినా విఆర్ఒ, సచివాలయ సర్వేయర్ స్పందించలేదని కాలనీవాసులు చెప్పారు. దీంతో సబ్ కలెక్టర్‌కి స్పందనలో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. అనంతరం తహశీల్దార్ మాట్లాడుతూ లే అవుట్ ఆధారంగా ఆక్రమణలను విడగొట్టి అతి త్వరలో మీ స్థలాలు మీకు ఇచ్చే విధంగా చర్యలు చేపడతామని కాలనీ వాసులకు భరోసా ఇచ్చారు.

నారాయణపురం కాలేజీకి రూ.1.50 లక్షల వితరణ

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురం శ్రీ అరవింద శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చేబ్రోలు విశాల సహకార పరపతి సంఘం కళాశాల గ్రంథాలయ అభివృద్ధి నిమిత్తం రూ.1.50 లక్షల విరాళం అందించారు. సంఘం త్రిసభ్య కమిటీ చైర్‌పర్సన్ యెలిశెట్టి పాపారావుబాబ్జి, సెక్రటరీ శ్రీనివాసరావు చేతులమీదుగా ప్రిన్సిపల్ డాక్టర్ టికె.విశ్వేశ్వరరావుకు చెక్కును బుధవారం అందించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్ రెడ్డయ్య, నాణ్యత ప్రమాణాల కో-ఆర్డినేటర్ డాక్టర్ కొండా రవి, కళాశాల కెమిస్ట్రీ లెక్చరర్ జి.హెబ్సిబా సహకార సంఘం వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పాపారావు బాబ్జి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో విద్య అభివృద్ధి జరగాలనే సదుద్దేశంతో కీర్తిశేషులు మూర్తి రాజు స్థాపించిన ఈ కళాశాల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తామని తెలిపారు.

చైర్‌పర్సన్‌కు అసత్య ప్రకటనలు తగవు

టిడిపి కౌన్సిలర్ల ఖండన

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

స్థానిక ఐదో వార్డులో రూ.50 లక్షలు ఖర్చు చేశామని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి ప్రకటించడాన్ని ఖండిస్తున్నామని ఐదో వార్డు కౌన్సిలర్ కె.రమాదేవి తెలిపారు. ఇటీవల జరిగిన మున్సిపల్ పాలకవర్గ సమావేశంలో 5, 10, 17 వార్డులకు నిధులు కేటాయించలేదని ప్రశ్నించిన టిడిపి కౌన్సిలర్లపై అనుచిత వ్యాఖ్యలు చేయడం, అసత్య ప్రకటనలు చేయడంపై టిడిపి కార్యాలయంలో బుధవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐదో వార్డు కౌన్సిలర్ కరుటూరి రమాదేవి మాట్లాడుతూ తన వార్డు సమస్యలు, అభివృద్ధి గురించి ప్రతిపాదనలు పంపితే అజెండాలో చేర్చకుండా చైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి ఐదో వార్డుకు రూ.50 లక్షలు ఖర్చు చేశామని, ఎలక్ట్రికల్ పోల్స్ వేయించామని చెప్పడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. 17వ వార్డు కౌన్సిలర్ నంబూరి రామచంద్రరాజు మాట్లాడుతూ వైసిపి కౌన్సిలర్ పిపిఎస్.చంద్రరావు గత టిడిపి పాలకవర్గంలో పనులు చేయకుండా కమీషన్లకు తమ వార్డు నిధులను ఇచ్చేశారని విమర్శించడం తగదన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి, ఈ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి లెక్కలు వేయడానికి తాము సిద్ధమని సవాల్ విసిరారు. పదో వార్డు కౌన్సిలర్ తెలగారపు జ్యోతి మాట్లాడుతూ పదో వార్డులో కొత్త రోడ్డు, డ్రెయినేజీలు, పైపులైన్ల పనులు రెండేళ్లలో చేయలేదని ఆవేదం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బొబ్బర రాజ్‌పాల్‌కుమార్, పట్టణ ప్రధాన కార్యదర్శి తూటికుంట రాము, పాతూరి అంబేద్కర్, తాతాజీ, రామకృష్ణ పాల్గొన్నారు.

ఆపన్నులను ఆదుకోవడమే మానవత్వం

ప్రజాశక్తి - చింతలపూడి

ఆపదలో ఆదుకోవడమే మానవత్వం అని బిసి సెల్ మండల ప్రధాన కార్యదర్శి కె.నాగరాజు అన్నారు. ప్రగడవరానికి చెందిన వికలాంగుడు కందుకూరి దుర్గాచారి ఇటీవల ఇల్లు నిర్మించుకున్నాడు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న తాను సాయం చేయాలని కోరగా స్పందించిన పలువురు రూ.ఏడు వేల విలువైన రెండు జతల ఇంటి తలుపులు దుర్గాచారికి అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి మాజీ సభ్యులు కె.వీర్రాజు, బిసి కార్యదర్శి చక్రపు మారేశ్వరరావు, చిమట బాబు, నిమ్మల ముత్తయ్య, రాచకొండ రాంబాబు, చెన్నారావు పాల్గొన్నారు.

గర్భిణులకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

చిన్నపిల్లలు, గర్భిణులు క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవాలని, అప్పుడే వైరల్ సంబంధిత వ్యాధులు పోలియో, కామెర్లు, అతిసారా, నిమోనియా, క్షయ పొంగు, తట్టు, కోరింత దగ్గు, కంఠసర్పి వ్యాధులు చిన్న పిల్లల దరి చేరవన్నారు. గర్భిణులు క్రమం తప్పకుండా ధనుర్వాతం ఇంజక్షన్ చేయించుకోవాలని అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు సూచించారు. స్థానిక ఏలూరు అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తంగెళ్లమూడిలో జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నపిల్లలకు నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం టీకాలు వేయించుకోవాలన్నారు. షెడ్యూల్ ప్రకారం 16 సంవత్సరాల వరకు వేయించుకోవాలన్నారు. కంటి చూపు బాగుండడానికి విటమిన్ ఎ ద్రావణాన్ని వేసుకోవాలని, అలాగే గర్భిణులు ప్రతినెలా వైద్యాధికారితో పరీక్షించుకుని రెండు మోతాదుల ధనుర్వాతం టీకా వేయించుకోవాలని సూచించారు. వైరల్ ఫీవర్, వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉన్నందున చిన్న పిల్లలు, గర్భిణులు వయసులో పెద్దవారు దూర ప్రయాణం చేయరాదన్నారు.